



బాలానగర్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చిన్నారి

## జాతీయ రహదారిపై..

# ట్రామాకేర్ సెంటర్లు

- సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమావేశంలో నిర్ణయం
- బాలానగర్ ప్రమాద ఘటనపై ఆరా తీసిన ముఖ్యమంత్రి
- బాలానగర్, జడ్చర్ల, జానంపేట, ఎర్రవెల్లి వద్ద ఏర్పాటయ్యే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు హైవేపై ఎక్కడా లేని సెంటర్లు
- ప్రమాదాల్లో ఏడాదిలో 16 మంది మృతి.. 35 మంది క్షతగాత్రులు
- ట్రామాకేర్ సెంటర్లు ఉంటే ప్రాణాలు నిలిచేవనే అభిప్రాయం





44వ నంబర్ జాతీయ రహదారి

మహబూబ్‌నగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలోని 44వ జాతీయ రహదారి పక్కన ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, మంత్రి జూపల్లి కృష్ణారావు తాజాగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల బాలానగర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన నేపథ్యంలో.. ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి కోరిన మేరకు సీఎం, మంత్రులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జాతీయ రహదారిపై ఎక్కడ ప్రమాదం జరిగినా పది నిమిషాల్లోపే ఆస్పత్రికి చేరేలా ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, ఇందుకోసం చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు సీఎం, మంత్రి హామీ ఇచ్చారు.

### 30-40 కిలోమీటర్ల పరిధిలో ఒక సెంటరు ఉండాలి

ప్రభుత్వ అధ్యయనాల మేరకు కనీసం 60 కిలో మీటర్లకు ఒక ట్రామాకేర్ ఉండాలని సూచనలున్నాయి. అయితే ఇక్కడున్న ప్రత్యేక పరిస్థితులు, రద్దీ, ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్రత, జాతీయ రహదారితో పాటు సమాంతరంగా ఆయా కేంద్రాలకు రాష్ట్ర రహదారులూ అనసంధానమై ఉండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని కనీసం 30 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామాకేర్ ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని ఎమ్మెల్యేలు, వైద్యులు చెబుతున్నారు.



బాలానగర్ పీహెచ్‌సీ

### ఏడాదిలో పదహారు మరణాలు

మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో బాలానగర్ నుంచి పుల్లూరు టోల్ ప్లాజా వరకు సుమారు 220 కిలో మీటర్ల పొడవున 44వ నెంబర్ జాతీయ రహదారి ఉంది. ఈ పరిధిలో అత్యవసర సమయాల్లో ప్రమాద బాధితులకు వైద్యం అందించే ట్రామాకేర్ సెంటర్ ఒక్కటీ లేకపోవడంతో ఏటా పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. పుల్లూరు నుంచి పెబ్బేరు వరకు ప్రమాదాలు జరిగితే అటు కర్నూల్‌కు, రాజాపూర్ నుంచి బాలానగర్ వరకు ప్రమాదాలు జరిగితే ఇటు మహబూబ్‌నగర్‌కు, అటు హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నారు. మధ్యలో జడ్చర్ల నుంచి కొత్తకోట వరకు ఎక్కడ ప్రమాదాలు జరిగినా మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు దాని తీవ్రతను బట్టి ఐదు నుంచి పది నిమిషాల్లోపు బాధితులకు సరైన వైద్యం అందితే ప్రాణాలతో బయటపడవచ్చని అనేక అధ్యయనాలు, నివేదికలు తేల్చిచెప్పాయి. ఈ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం జాతీయ రహదారులపై ప్రతీ 60 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖకు సూచించింది. ప్రభుత్వాల నుంచి ఈ సెంటర్ల ఏర్పాటుకు స్పష్టమైన సూచనలున్నప్పటికీ ఆ దిశగా వైద్యఆరోగ్యశాఖ సరైన కార్యాచరణ చేపట్టకపోవడంతో ఏర్పాటు చేయలేదు. మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలను పరిశీలిస్తే 2023 సంవత్సరంలో జాతీయ రహదారిపై ఈ మూడు జిల్లాల పరిధిలో జరిగిన ప్రమాదాల్లో సకాలంలో సరైన వైద్యమందక 16 మంది చనిపోయారు. మరో 35 మంది వరకు అవయాలు కోల్పోయారు. జాతీయ రహదారితో పాటు ఇతర రహదారులపైనా ప్రమాదాలు జరిగి, ప్రాణాలు కోల్పోయిన వారు ఈయేడాదిలో మరో 22 మంది ఉన్నారు. వీరికి సకాలంలో సరైన వైద్యమందితే బతికే వారని చెబుతున్నారు. హైవేపైనా, అన్ని ఇతర రోడ్లకు సమీపంలో ఉండేలా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటైతే ఈ మరణాల్లో కనీసం 50 శాతమైనా తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



### బాలానగర్, జడ్చర్ల, జానంపేట, ఎర్రవెల్లి వద్ద ఏర్పాటుకు అవకాశం

44వ నెంబర్ జాతీయ రహదారిపై ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అనుగుణంగా ఉండేలా బాలానగర్, జడ్చర్ల, జానంపేట, ఎర్రవెల్లి వద్ద ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే సూచనలు వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనూ ఈ ప్రతిపాదనలు ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. జానంపేట పీహెచ్‌సీ వద్ద ఐదెకరాల స్థలాన్ని కూడా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు అప్పట్లో ప్రతిపాదించారు. ఇక్కడున్న పీహెచ్‌సీని 50 పడకలకు పెంచి, దాంట్లోనే సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కానీ ముందుకు సాగలేదు. తాజాగా మళ్లీ ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు అంశం తెరమీదకు రావడంతో ఈనాలుగు ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందనే అభిప్రాయం వెల్లడవుతోంది.



జానంపేట పీహెచ్‌సీ

### అందుబాటులో అత్యవసర వైద్యం

ట్రామాకేర్ సెంటర్లు ఏర్పాటైతే అక్కడ ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స అందించే నిమిత్తం 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ సెంటర్లు మూడు రకాలుగా ఉంటాయి. ఎల్-3 ట్రామాకేర్ సెంటర్ అయితే ఏడాదికి రూ.తొమ్మిది కోట్ల నిర్వహణ వ్యయం ఉంటుంది. ఎల్-2 సెంటర్ అయితే ఏడాదికి రూ.20 కోట్లు, ఎల్-3 ట్రామాకేర్ సెంటర్ అయితే ఏడాదికి రూ.50 కోట్ల వరకు వ్యయం ప్రభుత్వం అందిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యయాన్ని భరిస్తాయి. ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటైన ప్రతీ చోటా ఆర్థోపెడిక్ సర్జన్, న్యూరో సర్జన్, న్యూరో ఫిజీషియన్, కార్డియాక్ స్పెషలిస్టుతో ఇతర సాంకేతిక సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారు. అదేవిధంగా ప్రతీ కేంద్రం వద్ద బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేస్తారు. వీటితో పాటు మూడు ప్రత్యేక అంబులెన్సులు ఈ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుతారు. ప్రమాదాల్లో గాయపడ్డ వారిని అంబులెన్స్‌ల ద్వారా ఈ కేంద్రం వద్దకు తెచ్చిన వెంటనే అవసరమైన అత్యవసర చికిత్స అందిస్తారు. వెంటనే అవసరమైతే ఆర్థోపెడిక్, ఇతర సర్జరీలు నిర్వహిస్తారు. ఆక్సిజన్, ఎమర్జెన్సీలో ఉపయోగించే ఇంజక్షన్లు, మందులు కూడా అందుబాటులో ఉంచుతారు. ప్రమాద బాధితుల ప్రాణాలు పోకుండా ఉండేందుకు అవసరమైన మేర చికిత్సను ఈ సెంటర్ల ద్వారా అందిస్తారని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ కేంద్రం ఏర్పాటైతే ఒక మోస్తారు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటైనట్లేనని అంటున్నారు. కేవలం ప్రమాద బాధితులకే కాకుండా ఇతర సమయాల్లో సాధారణ రోగులు, దీర్ఘకాలిక రోగులకు సైతం అదే స్థాయిలో ఇక్కడ వైద్య సేవలు అందుతాయి.

## వ్యవసాయ మోటార్ల దొంగల అరెస్టు

- నలుగురి రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 10: మోటార్ల దొంగతనానికి పాల్పడిన ఇద్దరితో పాటు వారి నుంచి ఆ మోటార్లను కొనుగోలు చేసిన మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ మహేందర్ బుధవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ మండలం పెద్దాపూర్ గ్రామంలోని కేఎల్‌ఐ కాల్వలో ఏర్పాటు చేసుకున్న రెండు వ్యవసాయ బోర్లను అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి గ్రామానికి చెందిన దాసరి మహేష్, గుంటి కరుణాకర్ దొంగిలించారు. వాటి విలువ రూ.40 వేలు ఉంటుందని తెలుస్తోంది. వాటిని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత ఇనుప సామాను కొనుగోలు చేసే లక్ష్మయ్య, సురేష్‌లకు విక్రయించారు. మోటార్ల అపహరణపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేశారు. వాటిని దొంగిలించిన, కొనుగోలు చేసిన నలుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



బోల్తాపడ్డ కారు

## కారు బోల్తా

తాడూరు, జనవరి 10: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం ఒక కారు విద్యుత్ స్తంభానికి ఢీకొని, బోల్తా పడింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడూరు మండలం అంతారం గ్రామానికి చెందిన వ్యక్తి జడ్చర్ల నుంచి అంతారం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. కారు బోల్తా పడిన సమయంలో కారులో ఒక్కరే ఉన్నారని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు కాలేదని ఎస్సై రామన్‌గౌడ్ తెలిపారు. కారు డ్రైవర్‌కు గాయాలు కాలేదు.



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు



సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు



ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

# ముగ్గుల హరివిల్లు

## ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్



ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని



ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినీనటి అనన్య





ముగ్గులు వేస్తున్న మహిళలు





అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

## పర్వతాపూర్ మైసమ్మ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న గ్రామస్థులు

నవాబ్‌పేట, జనవరి 10 : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవస్థానంలో బుధవారం అమ్మవారి జాతర మహోత్సవాల హుండీ లెక్కింపు చేపట్టారు. 33 మాసాల వెండి, రూ.లక్షా ఇరవై మూడువేల నగదు వచ్చినట్లు ఆలయ చైర్మన్ పాశం కృష్ణయ్య, ఈఓ మదనేశ్వర్ రెడ్డి తెలిపారు. జాతరను విజయవంతం చేసిన భక్తులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైస్ ఎంపీపీ సంతోష్ రెడ్డి, సర్పంచ్ జంగమ్మ, వేణుచారీ, నారాయణ రెడ్డి, తానెం రాజు, మాదవులు, మైనుద్దీన్, ఆలయ సిబ్బంది గోపాల్, నర్సింహులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 10 : బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ అడ్మిషన్స్ ప్రవేశాల కోసం ఈ నెల 31లో దరఖాస్తు చేసుకోవాలని ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మావతి, వర్సిటీ సెంటర్ రీజనల్ కో ఆర్డినేటర్ సత్యనారణ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యను చదవాలనుకున్నవారు దరఖాస్తులు చేసుకోవాలని, ఇతర వివరాలకు సెంటర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## 'బీఎడ్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ నిర్వహించాలి'

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 10 : పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న బీఎడ్ కళాశాల విద్యార్థులకు డీఎస్సీ, టెట్‌ను దృష్టిలో పెట్టుకుని నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. బుధవారం పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్‌కు స్వేరో పీయూ విద్యార్థి నాయకులు రూప్‌సింగ్, నాగార్జున, ప్రేమలత, అఖిల, రాధిక, సౌలేశ్వరి, శేఖర్ వినతి పత్రం అందజేశారు.

## ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల, జనవరి 10 : ఈఎంఆర్ఐ(108) సంస్థలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్‌గా పని చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని 108, 102 సర్వీసెస్ మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ మహబూబ్‌మియా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ కోర్సులు చేసిన వారు 30 సంవత్సరాల లోపు ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 12న జడ్చర్లలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని 108 కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు ఒక సెట్ జిరాక్స్‌కాపీలను వెంట తీసుకురావాలని కోరారు.

## రవీంద్రటాకీస్‌లో ఎగిసిపడ్డ మంటలు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నాగనూల్ చౌరస్తాలో గల రవీంద్రటాకీస్‌లో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న నాగర్‌కర్నూల్‌తో పాటు, కల్వకుర్తి అగ్నిమాపక వాహనాలు మంటలను ఆర్పివేశారు. చాలా ఏళ్లుగా ఈ థియేటర్ మూతపడడంతో చెత్తచెదారం పేరుకుపోయింది. ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలతో ప్రొజెక్టర్‌తో పాటు, కుర్చీలు, అందులో ఉన్న డోర్లు కాలి అగ్నికి ఆహుతి అయ్యాయి.

## యాంత్రీకరణతోనే సాగు లాభదాయకం

**- ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి**



వేరుశనగ డిగ్గర్ యంత్రం పనితీరును వివరిస్తున్న ఏడీఆర్

బిజినేపల్లి, జనవరి 10 : పంటల సాగుకు విరివిగా యంత్ర పరికరాల వినియోగం పెంచుకోవడం ద్వారా పెట్టుబడి తగ్గడంతో నాణ్యమైన పంట ఉత్పత్తుల వల్ల వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం అల్లీపూర్‌లో బుధవారం వేణుగోపాల్ అనే రైతు పొలంలో వేరుశనగ డిగ్గర్ అనే యంత్రం పనితీరుపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించి, మాట్లాడారు. వేరుశనగ సాగులో పంట కోత సమయంలో కూలీల అవశ్యకత ఎక్కువగా ఉండడం వల్ల పెట్టుబడి ఎక్కువ అవుతున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. పెట్టుబడి తగ్గించడంతో పాటు, కూలీల కొరతను అధిగమించేందుకు వివిధ పంటల సాగులో యాంత్రీకరణ వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. అలాగే, ఈ ప్రాంత నేలలకు అనువైన వేరుశనగ పంట రకాలను, తీసుకోవల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు స్రవంతి, రామకృష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి నీతిరెడ్డి, ఏఈఓ మధు, 65 మంది రైతులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్నాం...

# ప్రాజెక్టులు మాకొద్దు

**- కాల్వల ద్వారా న్యాయం చేయండి**

**- తహసీల్దార్ కార్యాలయంలో బాధిత రైతుల వినతి**



బల్మూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పద్మకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

బల్మూరు, జనవరి 10 : ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణం కోసం తాము భూములు కోల్పోతున్నామని, తమ పరిస్థితి ఏంటని, తాము ఎలా బతకాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామ సమీపంలో ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు తెలుపడంతో భూములు కోల్పోతున్న రైతులు లోలోపల మదనపడుతున్నారు. గత ప్రభుత్వం రూపకల్పన చేసిన ప్రాజెక్టు నిర్మాణం మ్యాపుల ద్వారా ప్రజలకు కొంత ఊరట ఇచ్చినప్పటికీ ప్రస్తుత కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాజెక్టు నూతన నిర్మాణం పేరున ప్రణాళిక రచించి కొత్తగా విడుదల చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత ప్రాజెక్టు ఒకవైపు అయితే నూతనంగా ఏర్పడే ప్రాజెక్టు నిర్మాణం కోసం చేస్తున్న కృషిలో నూతనంగా వచ్చిన ప్రభుత్వం ఎంతవరకు సఫలీకృతమవుతుందో తెలియదు కానీ రైతులకు మాత్రం ఆవేదన మిగిలింది. నూతన ప్రాజెక్టు ద్వారా దాదాపు రెండు వేల 500ఎకరాల నుంచి మూడు వేల ఎకరాల వరకు సాగుభూమి కోల్పోతున్నట్లు సమాచారం గట్టిగా ఉన్నప్పటికీ రైతులు ఉన్న భూములను కోల్పోతే చివరకు మిగిలేది ఏముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, ఎమ్మెల్యే వంశీకృష్ణ రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. పాత ప్రభుత్వం ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ప్రాజెక్టు నిర్మాణం కోసం చేపట్టే దేవస్థానం నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏదేమైనా ప్రభుత్వాలు మారుతున్న కూడా రైతుల జీవితాలతో ఆటలాడుకునే విధంగా ప్రభుత్వ సంస్థలు, అధికారులు ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రతినిత్యం కృషి చేస్తున్న వ్యవస్థను బట్టి కొందరు రైతులు నష్టపోతే వందలాది మంది రైతులు బాగుపడుతారు. మరోవైపు ప్రభుత్వం నాటి ప్రా జెక్టుల పైన ఉన్న విధివిధానాలను చూస్తూ నూతనంగా వచ్చే ప్రాజెక్టు నిర్మాణంలో మార్పుచేర్పులను కూడా ఆలోచించడంపై కొందరు మేధావులు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కృషి చేస్తున్నదని వారు పేర్కొన్నారు. రైతుల కోసం పనిచేసే ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసి, విధివిధానాలురూపొందించాలని మండల రైతులు కోరుతున్నారు.

## 'పాలమూరు-రంగారెడ్డి'పై విచారణ జరపాలి

**- పాలమూరు అధ్యయన వేదిక**

మహబూబ్‌నగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, నూతనంగా గెలిచిన ఎమ్మెల్యేలు పాలమూరు- రంగారెడ్డి లిఫ్టు అవినీతిపై పోరాటం చేయాలని, ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై జరుగుతున్నంత చర్చ పాలమూరు- రంగారెడ్డి, పాలమూరు-డిండి ప్రాజెక్టుల అవినీతిపై జరగడం లేదని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈరెండు పథకాల అవినీతిపైకూడా తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు అవినీతిపై తీవ్రంగా ఆరోపణలు చేసిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి తన స్వప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్‌లో చేరారని, ఆయన ఇప్పుడు నోరుమెదపరని అన్నారు. ప్రాజెక్టు రీడిజైన్ వల్ల వ్యయం భారీగా పెరిగిందని, అవినీతి కోసమే రీడిజైన్ చేశారని రైతాంగం భావించారని పేర్కొన్నారు. రీడిజైన్ చేశాక కూడా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టలేదని విమర్శించారు. నిర్మాణం చేపట్టిన నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్లను ఎక్కడాలేని విధంగా చుట్టూ కట్టలుగా చాలా బలహీనంగా నిర్మించారని, వాటితో మున్ముందు చాలా కష్టనష్టాలకు అవకాశ ముందని, నిపుణులు, ఇంజనీర్లు లేఖలురాసినా అప్పటి సీఎం కేసీఆర్ ఖాతరు చేయలేదని పేర్కొన్నారు. ఉద్యమ పార్టీ అనేభావనతో బీఆర్‌ఎస్‌ని గెలిపిస్తే, తెలంగాణలోనే అత్యంత వెనకబడిన పాలమూరుకు ఏమీ చేయలేదని దుయ్యబట్టారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల నిర్వహణే ఆ పార్టీ మోసం చేసిన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.



## వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

నవాబ్‌పేట, జనవరి 10 : మండలంలోని హన్మసానిపల్లి గ్రామానికి చెందిన చెన్నారం కృష్ణయ్య పదేళ్ల క్రితం బైక్‌పై వెళ్తూ కిందపడ్డాడు. అప్పటినుంచి మతిస్థిమితం లేక ఊర్లో, బంధువుల వద్దకు ఎక్కడపడితే అక్కడ తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఐదేళ్ల నుంచి ఇంటికి రావడం లేదని, ఇతని ఆచూకీ కనిపెట్టాలని ఆయన భార్య చెన్నారం లక్ష్మీదేవి బుధవారం నవాబ్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సురేష్‌బాబు తెలిపారు.



## కాళేశ్వరంపై సీబీఐతో

# విచారణ జరిపించాలి

**» బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ**



జడ్చర్లలోని అయ్యప్పస్వామి దేవాలయంలో పూజ చేస్తున్న డీకే అరుణ

జడ్చర్ల, జనవరి 10 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీబీఐతో విచారణ చేయించాలని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని గంగాపురం రోడ్డులో గల అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఎన్నికల ముందు మాట్లాడింది వేరని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట్లాడుతున్నది వేరుగా ఉందని ఆరోపించారు. కాళేశ్వరంపై జరిగిన అవినీతిని బయటికి తేవాలని, అవినీతి పరులు ఏ విధంగా కుమ్మక్కయ్యారు?, నిర్మాణంలో జరిగిన లోపాలేంటి?, రూ.లక్షల కోట్లకు అంచనా ఎందుకు పెరిగింది?, వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన వారిని బట్టబయలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ అవకాశం కాంగ్రెస్‌కు పార్టీకి ప్రజలు ఇచ్చారని అన్నారు. కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలో జరిగిన అవినీతి కక్కించాలంటే సీబీఐతో విచారణ చేయించాలని కోరారు. జ్యుడీషియల్ విచారణతో అవినీతి బట్టబయలు అవుతుందనే విశ్వాసం ఉండదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలతో పాటు తెలంగాణలో, దేశవ్యాప్తంగా మళ్లీ ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో ఇతర పార్టీలకు ఓటు వేసినా, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేస్తామని, నరేంద్రమోదీ నాయకత్వమే కావాలని ప్రజలు అంటున్నారని చెప్పారు. మూడో పర్యాయం నరేంద్రమోదీ ప్రధాన మంత్రి అవుతున్నారన్నారు. నరేంద్రమోదీకి పోటీ ఇచ్చే అభ్యర్థి కాంగ్రెస్ పార్టీలో జాతీయ స్థాయిలో లేరన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సాహితిరెడ్డి, చెవ్వ నాగరాజు, మధు, కొంగళి శ్రీకాంత్, అమర్నాథ్‌గౌడ్, అయ్యప్ప స్వాములు రంజిత్ బాబు, ఎర్ర శ్రీనుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగ తాకి రైతు మృతి



సామ్యానాయక్ (ఫైల్)

లింగాల, జనవరి 10 : నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండల పరిధిలోని కొత్తచెర్వు తండాకు చెందిన రైతు ముడావత్ సామ్యానాయక్ (60) విద్యుత్ షాక్‌కు గురై బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సామ్యానాయక్ రబీలో తన సొంత వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటను సాగు చేసుకు న్నాడు. అడవి పందుల నుంచి పంటను రక్షించుకోవడానికి పంట చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం రాత్రి చేనుకు నీటి తడిని పెట్టి తెల్లవారు జామున బోరుమోటారును బంద్ చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కంచెను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం వరకు కూడా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం దగ్గరికి వెళ్లగా మృతదేహం కనిపించింది. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

## రేషన్‌లో ప్రొటీన్స్ బియ్యం ?

**- ప్లాస్టిక్ బియ్యం అంటూ లబ్ధిదారుల అనుమానం**

**- ఆందోళన వద్దని తహసీల్దార్ సూచన**

నవాబ్‌పేట, జనవరి 10 : పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయంటూ మండలంలో రెండు రోజులు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. పేద ప్రజలకు మంచి ఆహారం ఇవ్వాలన్న భావనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ నెల చౌకధర దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం ప్లాస్టిక్ బియ్యం కలిపారని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలుకు మూడు కిలోల ప్రొటీన్స్ లభించే చిరుధాన్యాలను కలిపి బియ్యంలో కలిపి అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఉన్న పేదలు తీసుకునే బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయంటూ ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గురుకుంట, కారుకొండ తదితర గ్రామాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన బియ్యాన్ని బుధవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా అవి ప్రొటీన్స్ బియ్యం అంటూ సివిల్ సప్లై, మండల డీలర్లు తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ మల్లికార్జున్ రావును వివరణ కోరగా పేదలకు అందిస్తున్న ప్రొటీన్స్ బియ్యం అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.

## వ్యక్తి రిమాండ్

గోపాల్‌పేట, జనవరి10: అమ్మాయి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు బుధవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఓ తండాకు చెందిన అమ్మాయి పట్ల కాట్రావత్ సంతోష్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు ఈనెల 5న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి సంతోష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## తొమ్మిది క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

**- ఒకరిపై కేసు నమోదు**

లింగాల, జనవరి 10 : అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుబడినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామానికి చెందిన భాస్కర్ మంగళవారం రాత్రి మహేంద్రా వాహనంలో లింగాలకు బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా ఉంచినట్లు ఎస్సై చెప్పారు. మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ఉంచిన వాహనాన్ని సోదా చేయగా అందులో 30 బస్తాల నల్లబెల్లం కన్పించింది. వాహనంతో పాటు, మరో వాహనాన్ని స్వాధీనపర్చుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్‌కు ఘన సన్మానం



వార్డెన్‌లను సన్మానిస్తున్న పీయూ అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 10 : మైక్రోబయాలజీలో ఎన్నో పరిశోధనలు చేసినందుకు గాను మైక్రోబయాలజిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా (ఎంబీఎస్ఐ) ఫెలో షిప్ అవార్డును పాలమూరు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, పీయూ రీసెర్చ్ సెల్ డైరెక్టర్, యంగ్ సైటిస్ట్ మైక్రోబయాలజీ అధ్యాపకులు ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్‌ను బుధవారం పీయూ పీజీ కళాశాల, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, అన్ని విభాగాల అధిపతులు, అధికారులు ఘనంగా సత్కరించారు.

● ఇదిలా ఉంటే బాలుర హాస్టల్ వార్డెన్‌లుగా దాదాపు ఏడేళ్లపాటు సేవలు అందించిన సురేష్, శ్రీనివాస్‌లను శాలువా, పూలబొకేతో ఘనంగా సన్మానించారు. ఓ వైపు విద్యార్థులకు బోధిస్తూనే, అదనంగా వార్డెన్ బాధ్యతలు నిర్వహించారు. వీరిని రిలీవ్ చేసి, వారే వారికి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పీయూ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సింబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## 16 పెద్దకార్పాములలో

## అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

పెద్దకొత్తపల్లి, జనవరి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల గ్రామంలో ఈనెల 16వ తేదీన ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర న్యూకేటగిరీ విభాగం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఫ్రెండ్స్ యువజన సంఘం సభ్యుడు సొంటె ఎల్లయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనే వృషభరాజుల యాజమానులకు మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.40వేలు, మూడవ బహుమతి రూ.30వేలు, నాల్గవ బహుమతి రూ.20వేలు, ఐదవ బహుమతి రూ.10వేలు, ఆరో బహుమతి రూ.8వేలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే, పోటీలో పాల్గొనే ప్రతీ ఎద్దుల జతకు రూ.ఐదు వేల ప్రోత్సాహక బహుమతులను అందిస్తామన్నారు. బండలాగుడు పోటీల్లో పాల్గొనే ఎద్దుల యాజమానులు వెయ్యి రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి ఆదేరోజు ఉదయం ఎనిమిది గంటలలోపు పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పోటీలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా వస్తున్నట్లు వారు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, పోటీలను తిలకించాలని ఆయన కోరారు.

## మార్కెట్‌కు వచ్చిన ఉల్లి



ఉల్లికి వేలం వేస్తున్న వ్యాపారస్తులు

దేవరకద్ర, జనవరి 10 : దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు పండించిన ఉల్లి విక్రయించేందుకు బుధవారం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చారు. మార్కెట్‌లో జరిగిన లావదేవీల్లో గరిష్ఠంగా రూ.2000, కనిష్ఠంగా రూ.1000, ధర పలికినట్లు మార్కెట్ సెక్రటరీ ఎల్లయ్య తెలిపారు. వ్యాపారులు, కొనుగోలుదారులు ఉల్లిని కొనుగోలు చేశారు. ఇప్పుడు సీజన్ కావడంతో మార్కెట్‌కు ఉల్లి వస్తున్నది. ఇంకా పెద్ద మొత్తంలో మార్కెట్‌కు రానుందని అధికారి తెలిపారు. మార్కెట్‌కు 265 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు ఆయన తెలిపారు.

## మాతృమరణాలు సంభవించకుండా చూడాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 10 : మహిళ గర్భందాల్చినప్పటి నుంచి ప్రసవం అనంతరం వరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముఖ్యంగా మాతృమరణాలు సంభవించకుండా చూడాలని కలెక్టర్ జి.రవినాయక్ అన్నారు. బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర స్థాయి నుంచి జిల్లా స్థాయివరకు ఆశ, ఏఎన్ఎం, డాక్టర్లతో పటిష్టమైన వ్యవస్థ ఉందని, ఈ వ్యవస్థపై ప్రజలకు మంచి నమ్మకం ఉందని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలిపే విధంగా మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి సుఖ ప్రసవం అయ్యే చూడాలన్నారు. జిల్లా వైద్యశాఖ ఆరోగ్య వాఖ అధికారి డాక్టర్ కృష్ణతో పాటు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ నటరాజ్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

## టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులకు సన్మానం

మహబూబ్ నగర్ (క్లాక్ టవర్), జనవరి 10 : బీఎస్ఎన్ఎల్ టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులను భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ శాలువాలతో సన్మానించారు. గత నెల 20న జరిగిన జిల్లా అడ్వైజర్ కమిటీ ఎంపికను పురస్కరించుకొని ఆమె తన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించారు. కమిటీ సభ్యులు కృష్ణవర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, నిరంజనమ్మ, గూటం శ్రీనివాస్, సాహితి రెడ్డిలను సన్మానించారు. అనంతరం మునిసిపల్ అవిశ్వాస తీర్మానంపై కౌన్సిలర్లు అంజయ్య, రామాంజనేయులను అడిగి తెలుసుకున్నారు.

## నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**- ప్రజాపాలన ఫిర్యాదుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్**

మహబూబ్‌నగర్, జనవరి 10 : ప్రజాపాలనలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నందున పకడ్బందీగా చేపటాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. ప్రజాపాలనలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల వివరాలను డేటా ఎంట్రీ ఆపరేటర్లచేత అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయిసున్నారు. పురపాలికలో చేపడుతున్నఆన్‌లైన్ ప్రక్రియను బుధవారం పుర కమిషనర్ ప్రదీప్‌కుమార్‌తో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తు చేసిన ప్రతీ లబ్ధిదారుడి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకోసం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని, ప్రజలు కూడా అంతే నమ్మకంతో తమకు కావాల్సిన పథకాలను దరఖాస్తు రూపంలో అందించారని, అధికారులు బాధ్యతతో పనిచేయాలని చెప్పారు.

## మతసామరస్యానికి ప్రతీక అబ్దుల్‌ఖాదర్ దర్గా

**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



అబ్దుల్‌ఖాదర్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

పాలమూరు, జనవరి 10 : మతసామరస్యానికి ప్రతీక అబ్దుల్‌ఖాదర్ దర్గా అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అబ్దుల్‌ఖాదర్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు, గంధోత్సవంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకుముందు దర్గా సంప్రదాయం ప్రకారం దర్గా పెద్ద జమీర్, పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. దర్గాకు 85ఏళ్ల చరిత్ర ఉందన్నారు. భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోరికలు తీరుతాయని నమ్మకం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగానే కాకుండా ఉమ్మడి రాష్ట్రం, కర్నాటకలో భక్తులు ఉన్నారు. మత సామరస్యానికిప్రతీకగా అబ్దుల్ ఖాదర్ దర్గా వెలుగొందుతోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, చంద్రకుమార్ గౌడ్, సిజె బెనహర్, సిరాజ్‌ఖాద్రి, బెక్కరి అనిత, శేఖర్‌రాథోడ్, లింగంనాయక్, బండ సునిల్‌కుమార్, లక్ష్మణ్‌యాదవ్, తఖి, మల్లునరసింహారెడ్డి, అజ్మత్ అలీ, తులసిరాంనాయక్, తాహెర్, అబుబాకర్, నరేందర్‌గౌడ్, రాజు, రాంరెడ్డి, దీపక్, అవేజ్, నవనీతలు పాల్గొన్నారు.

### వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 10 : సాధ్యమైనంత త్వరలోనే వ్యాయామవిద్య ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (టీజీపీఈటీఏ) 2024 సంవత్సరపు నూతన క్యాలెండర్‌ని బుధవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన క్యాలెండర్ ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు విలియమ్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కోశాధికారి మొగులాల్, జిల్లా బాధ్యులు మొయిన్, రవికుమార్, శ్రీనివాస్‌లు, రాములు, రాము, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఆల కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి

భూతుర్పూర్, జనవరి 10 : దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు డోకూరు పవన్‌కుమార్‌రెడ్డి, ఎగ్గని నర్సిములు తదితరులు బుధవారం ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో స్థానిక మునిసిపల్ చైర్మన్ బస్వరాజు గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఈ-చలానా చెల్లింపు గడువు 31 వరకు పొడిగింపు



జిల్లా కేంద్రంలో చలానా వసూలు చెల్లిస్తున్న వాహనదారులు

మహబూబ్‌నగర్, జనవరి 10 : ఈ-చలానాపై ప్రభుత్వం ఇచ్చిన గడువు బుధవారం చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున వాహనదారులు చెల్లింపులు చేసేందుకు ముందుకు వచ్చారు. గడువు ముగిసినా ఇంకా చెల్లింపులు జరుగుతుండంతో ప్రభుత్వం ఈనెల 31వరకు గడువు పొడిగించింది. ఈ-చలానా చెల్లింపులకు ప్రభుత్వం రాయితీ ప్రకటించడంతో పెద్దఎత్తున వాహనదారులు చెల్లింపులు చేశారు. జిల్లావ్యాప్తంగా రూ.10 కోట్లు పెండింగ్‌లో ఉండగా రాయితీ పోను మిగిలిన డబ్బు లో దాదాపుగా వసూలైందని పోలీస్‌అధికారులు చెబుతున్నారు. గతనెల 25నుంచి జనవరి 6 వరకు, ఆ తర్వాత 10 వరకు, ప్రస్తుతం ఈనెల 31వరకు ప్రభుత్వం గడువు పెంచింది. ఆన్‌లైన్ చెల్లింపులకు అందరూ ప్రయత్నిస్తుండటంతో చాలావరకు సర్వర్ మొరాయించింది. చెల్లింపుల కోసం చాలాసేపు ప్రయత్నించాల్సి వచ్చింది. ఇక పాలమూరు పట్టణంలోని మల్లికార్జున చౌరస్తా దగ్గర ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటుచేసిన కౌంటర్ వద్ద నేరుగా చెల్లిం పులు చేయడం, అక్కడ ఉన్న సిబ్బంది ఆన్‌లైన్ చెల్లింపులు చేస్తుండటంతో అక్కడికి చాలా మంది వాహనదారులు వెళ్లి చెల్లింపులు చేశారు. 60-90 శాతం మేర రాయితీ ఇవ్వడంతో వాహనదారులు పెద్దఎత్తున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు రూ.7కోట్ల 5లక్షల 22వేల 970 చలానా డబ్బులు వసూల య్యాయి. ఇందులో బుధవారం ఒక్కరోజే రూ.77.44 లక్షలు వసూలు కావడం విశేషం.

## ఎస్‌ఎస్‌సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**- జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్**

జడ్చర్ల, జనవరి 10 : ఎస్ఎస్‌సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ సూచించారు. జడ్చర్ల మండలం పెద్దఆదిరాల జడ్పీహెచ్‌ఎస్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ విద్యార్థులతో మాట్లాడారు. మార్చి నెలలో జరగబోయే వార్షిక పరీక్షలలో ఎస్ఎస్‌సీ విద్యార్థులందరూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రతి రోజు వేకువజామున 5గంటల నుంచి 7 గంటల వరకు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ప్రతి రోజు సబ్జెక్టుల వారీగా స్లిప్‌టెస్టులు పెట్టాలని, లో గ్రేడ్ ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, ఉపాధ్యాయులు ఆనందం, అనురాధ, నరసింహులు, మధు, సంధ్య, కృష్ణనాయక్, శ్రీదేవి, తాహెర్ తదితరులున్నారు.

● నవాబ్‌పేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ న్నత పాఠశాలలో శిక్షణ ఫౌండేషన్‌పై మండల రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాస్, రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సంస్థ నేపథ్యంపై మండల ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజునాయక్, నోడల్ అధికారి నాగ్యానాయక్, సీఆర్పీ జనార్దన్, రాములు, చంద్రమోహన్, శాంతబాయి, సాయిస్వర్ణ మల్లికార్జున్ పాల్గొన్నారు.

# అభివృద్ధి కాదు.. అరాచకం ఆగింది

**- పదేళ్లలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ**

**- బాధితుల కోసం కాంగ్రెస్ కార్యాలయంలో సెల్ ఏర్పాటు**

**- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై కాంగ్రెస్ నాయకుల ధ్వజం**




సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, జనవరి 10 : పాలమూరులో అభివృద్ధి ఆగిపోలేదని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అరాచకాలు ఆగిపోయాయని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో పాలమూరులో ఎన్నో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని, వాటన్నింటిపై సమగ్ర విచారణ చేయిస్తామని, అవసరమైతే జ్యుడీషియల్ విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేసిన అరాచక కార్యక్రమాలకు ఆయనకు ఏ శిక్ష విధించినా తక్కువే అవుతుందని చెప్పారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, ఎం. సురేందర్ రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్‌లు మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత తో కలిసి మాజీమంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పాలమూరులో ఎక్కడా అభివృద్ధి పనులు ఆగలేదని, ఇదివరకు జరిగిన పనులన్నింటిపై విచారణ జరుగుతోందని, చాలాపనులకు నిధులు లేకుండానే ప్రొసీడింగ్స్ ఇచ్చి కాంట్రాక్టర్లను బెదిరించి పనులు చేయించారన్నారు. అన్నీ అబద్ధపుమాటలు, మోసపుచర్యలతో ప్రజలను నమ్మించేప్రయత్నం చేశారని ఆరోపించారు. మునిసిపాలిటీలో వందకోట్ల పనులన్నీ హడావిడి చేసినా నిధులే లేవని, మినీ ట్యాంక్‌బండ్‌లో చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు రూ.15 కోట్లు బిల్లులు రావాలని, ఆయన తీవ్ర మానసిక వేదనలో ఉంటే తామే ధైర్యం చెప్పామని, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రధానరహదారికి మధ్యన కడుతున్న నిర్మాణాలు ఎవరి ప్రయోజనం కోసమో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆగింది అభివృద్ధి కాదని, అరాచకం ఆగిందని చెప్పారు. మాజీమంత్రి బాధితులు చాలామంది ఉన్నారని, ఇంకా కొందరు భయపడి బయటకు రావడం లేదని వారికోసం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సెల్ ఏర్పాటుచేసి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. బాధితులందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. కౌన్సిలర్‌లు పార్టీ మారారని, వారిపై ఫిర్యాదులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదివరకే సుధాకర్‌రెడ్డి, రమాదేవిలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన బీఆర్ఎస్‌నేతలు ఇప్పుడు మళ్లీ కొత్తగా చర్యలు తీసుకోవాలని అడగడంలో అర్థం లేదన్నారు. ప్రస్తుత చైర్మన్ అసమర్థత కారణంగా కొత్తగా చైర్మన్‌ను ఎన్నుకుంటే వార్డులు అభివృద్ధి చెందుతాయని, తాము ఆత్మగౌరవంతో బతకాలన్న ఆలోచనతో చాలామంది స్వచ్ఛందంగా అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. చైర్మన్‌ను దించేందుకు కౌన్సిలర్‌లు అంతా ముందుకు వస్తే కాంగ్రెస్ మద్దతిస్తుందని, అంతే తప్పా వారందరినీ కాంగ్రెస్‌లోచేర్చుకున్నామని బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, అది పార్టీ నిర్ణయిస్తుందని వివరించారు. ఈ సమాశంలో నాయకులు సిరాజ్‌ఖాద్రి, సీజె బెనహర్, రాములుయాదవ్, మల్లునర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# నేరగాళ్లకు శిక్షపడే శాతం పెరగాలి

**- నేర సమీక్షలో ఎస్పీ హర్షవర్ధన్**




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్, జనవరి 10 : కేసుల విచారణ పారదర్శకంగా జరగాలని, తప్పు చేసిన నేరస్థులకు కోర్టులలో శిక్ష పడేశాతం పెరగాలని, ఆ దిశగా విచారణ జరగాలని ఎస్పీ హర్షవర్ధన్ అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేలవారి నేరసమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల వారీగా కేసుల వివరాలు, పెండింగ్ కేసులు, అక్కడి పరిస్థితులపై ఆయా స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాసనసభ ఎన్నికలు పూర్తయినందున పోలీసులు స్టేషన్ పనిపై దృష్టి సారించాలని, వ్యవస్థీకృత నేరాలపై దృష్టి సారించాలని సూచించారు, పోలీస్ స్టేషన్‌ల వారీగా గ్రేవ్, నాన్‌గ్రేవ్, యూఐ కేసులవి వరాలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలు, పోక్సో కేసులపై చర్చించిన ఆయన ఈ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నేరస్థులకు శిక్షలు పడే శాతం పెరిగితే నేరాలను నియంత్రివచ్చవని, ఈ దిశగా పోలీసులు ప్రయత్నించాలన్నారు. దొంగతనాల కేసులను ఛేదించడంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇందుకోసం తగిన ప్రణాళికతో ముందుకెళ్లాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ఆయా స్టేషన్‌ల అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు వచ్చిన 2022 బ్యాచ్‌కు చెందిన ప్రొబేషనరీ ఐపీఎస్ చిత్తరంజన్‌కు స్వాగతం పలికిన ఎస్పీ ఆయనకు పోలీసు అధికారులను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్, డీఎస్పీ మహేశ్, డీసీఆర్‌బీ డీఎస్పీ జీవీ రమణారెడ్డి, ఎస్‌డీఎస్పీ కిరణ్, సైబరాబాద్ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తూతూ మంత్రంగా మూసాపేట మండల సమావేశం



మూసాపేట మండల సభలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అడ్డాకుల (మూసాపేట), 10 : మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం మండల సర్వసభ సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. మండల పరిషత్ అధ్యక్షురాలు గూపని కళావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు వ్యవసాయం, గ్రామీణ తాగునీరు, విద్యుత్, విద్య, వైద్య ఆరోగ్య, జాతీయ గ్రామీణ ఉపాధి, పౌరసరఫరాలు, పశుపోషణ తదితర శాఖల అధికారులు చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్ మాట్లాడుతూ మండల అధికారులు ప్రజాపాలనపై మండల ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా, సూచనలను తీసుకోకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎంపీడీవో స్వరూప కల్పించుకొని మండలంలో ఉండే ప్రతీ ప్రజాప్రతినిధికి వాట్సాప్ ద్వారా మెసేజ్‌లు పెట్టడమే కాకుండా ఫోన్ ద్వారా సమాచారం అందించామని ఆమె తెలిపారు. ఏదేమైనా మండల సభ మాత్రం గంటలో ముగించి అధికారులు మమ అనిపించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గూపని కళావతి, జడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపీటీసీ సభ్యులు సీజీ గోవర్ధన్, సత్యనారాయణ, సంతోష, పల్లవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

### పథకాలపై ప్రచారం

హన్వాడ, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రచారం కోసం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మండలంలోని ఏనెమీదితండాలో బుధవారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్క్రీన్ ద్వారా కేంద్ర పథకాలను ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం డ్రోన్ సిస్టం ద్వారా పంట పొలాల్లో నూతన విధానంలో మందులు పిచికారిని ఏవిధంగా చేయాలో ప్రదర్శించి చూపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి మాట్లాడారు. కేంద్ర పథకాలను వివరించారు. అభివృద్ధిలో ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని మొదటిస్థానంలో నిలిపేందుకు కష్టపడుతున్న ప్రభుత్వానికి అందరు అండగా ఉండాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డుతో రూ.5 లక్షల వైద్యం, బ్యాంక్ అకౌంట్లు, పీఎం కిసాన్ తదితర పథకాలపై ప్రజలకు వివరించారు. అదేవిధంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్, వ్యవసాయ అధికారులు, ఉప సర్పంచ, వార్డు సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తండా వాసులు పాల్గొన్నారు.

### రామాలయ నిర్మాణం హిందువుల ఆత్మ

మహబూబ్ నగర్ (క్లాక్‌టవర్), జనవరి 10 : అయోధ్యలో నిర్మించిన రామాలయ భవ్యమందిరం హిందువుల ఆత్మ అని శ్రీరామాంజనేయ భక్తులు అన్నారు. అయోధ్య పూజిత అక్షింతల వితరణలో భాగంగా బుధవారం(ఎనుగొండ) అక్షర కాలనీలో వితరణ జరిగింది. కార్యక్రమంలో కాలనీవాసులతో పాటు హౌసింగ్ బోర్డ్ కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### గిరిజన ఉద్యోగ సంఘం మండల అధ్యక్షునిగా గోపాల్‌నాయక్

హన్వాడ, జనవరి 10 : గిరిజన ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షునిగా గోపాల్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిజానాయక్ తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవిజానాయక్ మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కమిటీ పని చేస్తుందన్నారు. మూడు సంవత్సరాలు కమిటీ పని చేస్తుందని చెప్పారు. తహసీల్దార్ కిష్టానాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కమిటీ కార్యవర్గ సభ్యులుగా జ్యోతి, కృష్ణానాయక్, రాము, రవినాయక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హన్మంతు, గణేష్, బద్రు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవాబ్‌పేట, జనవరి 10 : మండలంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల విద్యార్థినులకు బుధవారం పీహెచ్‌సీ డాక్టర్ నరేష్ చంద్ర ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీ రోజు శుభ్రత పాటించాలని, లేదంటే అంటురోగాలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోని, మాస్కులు ధరించకపోతే కరోనా వంటి రోగాలు వస్తాయన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, లేదా అందుబాటులో ఉన్న ఏఎన్ఎం, ఆశాల సలహాలు పాటించాలన్నారు. డాక్టర్ శ్రీజ, వార్డెన్ బందెమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ రాములు, బాలమ్మ, శ్రీనివాస్, శరభలింగం, బీచుపల్లి గౌడ్, భారతి, ఆశ కార్యకర్తలు నీలమ్మ, జయలక్ష్మీ, నర్సమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యలు తెలుసుకోవడానికే ముఖాముఖి

**-ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**



కుచ్చర్‌కల్ గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

రాజాపూర్, జనవరి 10 : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడానికే ప్రజలతో, పార్టీ కార్యకర్తలతో ముఖముఖీ కార్యక్రమం నిర్వహిసున్నట్లు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుచ్చర్‌కల్ గ్రామంలో గ్రామస్థులతో, కార్యకర్తలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామ శివారులో ఉన్న వాగు నుంచి ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను అక్రమంగా తరలించడాన్ని అరికట్టాలని, గ్రామాల్లో దుకాణాలో మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులను అరికట్టాలని, గ్రామంలో పూర్తిగా సీసీ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నరహరి, రమేష్, రమణ, శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు గోపీకాంత్, ఉదయ్ కుమార్, రఘునందన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


**పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే**

బాలానగర్ : ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన సంఘం క్యాలెండర్‌ను జడ్చర్ల ఎమ్మెల్యే జె.అనిరుధ్‌రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరై ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి

**- లాఠీచార్జీపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి**

**- మహ్మద్ ఖాసీం సంస్మరణ సభలో వక్తలు**



మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి

చిన్నచింతకుంట, జనవరి 10 : చిత్తనూరు ఇథనాల్ కంపెనీని వెంటనే రద్దు చేయాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి, కేపీఎన్‌పీఎస్ జాతీయ కన్వీనర్ బండారి లక్ష్మయ్య టీపీఎఫ్ నాయకులు నాగభూషణం, టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, సుదర్శనం డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి మండలంలోని పర్దిపూర్ గ్రామంలో చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో టీఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి పి. యాదగిరి అధ్యక్షతన మహమ్మద్ ఖాసీం సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా స్థానికులనుద్దేశించి వారు మాట్లాడారు. పచ్చటి పొలాల మధ్యన విషతుల్యమైన రసాయనాలను వదిలే కంపెనీని తీసుకురావడం సరికాదని పేర్కొన్నారు. ఈ కంపెనీ వల్ల జీవరాశులతో పాటు మానవ మనుగడకు ముప్పు ఉందని తెలిపారు. దీన్ని వ్యతిరేకించిన వారిపై లాఠీచార్జిచేయటం వల్ల ఖాసీం నడుము విరిగి ఆస్పత్రిలో చేరగా, పరిస్థితి విషమించి, గతనెల 27న ఖాసీం మరణించాడని పేర్కొన్నారు. ఖాసీం కుటుంబానికి రూ.25లక్షల పరిహారం చెల్లించాలని, లాఠీచార్జికి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, వారు డిమాండ్ చేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి బి. వేణుగోపాల్, రైతు సంఘం నాయకులు రాంచంద్రయ్య, జాలాల్‌పాషా, రాజేశ్వర్, బాలరాజు, నాగరాజు పాల్గొన్నారు.

## మౌంట్‌బాసిల్‌లో ఆంగ్లభాషా అభ్యసన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 10 : పట్టణంలోని మౌంట్‌బాసిల్ హైస్కూల్‌లో కరాడీపాత్ ఆంగ్లభాష అభ్యసన కార్యక్రమ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఆట, పాటలతో



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమం



వేదికపై ఉపాధ్యాయులు

ఆంగ్లభాష వాతావరణాన్ని కళ్లకుకట్టినట్లు చూయించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ చంద్రకళవెంకటయ్య మాట్లాడుతూ కరాడీపాత్ ఆంగ్లభాష విశిష్టతను వివరించారు. నేటి సమాజంలో ఆంగ్లభాష ఎంత ప్రభావం చూపిస్తుందో వివరించారు. ఆంగ్లభాషపై ప్రతీ ఒక్కరు పట్టు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కృష్ణసుశాంత్, కరస్పాండెంట్ పూజిత, మోహన్‌రెడ్డి, కోశాధికారి శిరీషప్రవీణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేశ్, వైస్‌ప్రిన్సిపాల్ సౌమ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు వివేకానంద జయంతి

**- రక్తదాన శిబిరం ఏర్పాటుకు సన్నాహాలు**

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 10 : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈనెల 12న వివేకానంద విద్యానికేతన్ పూర్వ ఉపాధ్యాయ, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం బాధ్యుడు టి.వినయ్‌కుమార్, రామకృష్ణ సేవాసమితి ఇన్‌చార్జి రాజమల్లేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా బాధితుల కోసం ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న రామకృష్ణసేవా సమితి కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులతో పాటు, యువతీ, యుకవకులు పాల్గొనాలని కోరారు.

### ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

దేవరకద్ర, జనవరి 10 : మండల పరిధిలోని చిన్న రాజమూర్ గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం ఎంపీడీవో శ్రీనివాసులు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అన్వేషచారి ఎంపీడీవోను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, భరత్‌కుమార్, గోవర్ధన్, ప్రేమ్‌కుమార్, ఉన్నారు.

### గత ప్రభుత్వంలోనే పాఠశాలల బలోపేతం

**- ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి**

భూత్పూర్, జనవరి 10 : బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యాయని ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లంబాడికుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదవ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ క్యార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన పలుసూచనలు, సలహాలను ఇచ్చారు. పిల్లలు బడిలో ఎలా చదువుతున్నారో ఉపాధ్యాయులు పెట్టే ప్రతీ నెల పేరెంట్స్ మీటింగుకు హాజరై విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులే స్వయంగా పరిశీలించాలని సూచించారు. గత ప్రభుత్వం హయాంలో మన ఊరు... మన బడి అనే పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కమలమ్మ, ప్రియాంకరెడ్డి, ఎంపీటీసీ రమణి, నాయకులు మాన్యనాయక్, బాలేమియా, ఏఎంవో శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం లావణ్య స్కూల్ కమిటీ చైర్మన్ పాత్లావత్ శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పాలమూరు, జనవరి 10 : గ్రామ పంచాయతీ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించిన ఐఎఫ్‌టీయూ జిల్లా రెండో మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో 12,769 మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అన్ని పంచాయతీలలో సుమారు 50వేల మంది కార్మికులు, ఉద్యోగులు, మల్టీపర్పస్ పేరుతో పనులు చేయటంతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఎ.నర్సింహ, వెంకటన్న, కొండన్న, గణేష్, వెంకట్రాములు, కురుమన్న, రాములు, బాలకృష్ణ, వెంకటయ్య పాల్గొన్నారు.

### నేడు దళిత బంధు కోసం ధర్నా

నవాబ్‌పేట, జనవరి 10 : బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు దళిత బంధు పథకం నిధులు లబ్ధిదారులకు విడుదల చేయాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు లబ్ధిదారులు ధర్నా చేపడుతున్నట్లు మాజీ ఎంపీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల లబ్ధిదారులు హాజరుకావాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకు నూతన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు.